క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

ముసునూరు: మండలంలో పలు అభివృద్ధి పనులను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. ముసునూరులో వైఎస్సార్ చేయూత కార్యక్రమం, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. జనరిక్ మెడికల్ షాపును ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

తిరువూరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం తిరువూరులో నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పార్టీ పతాకావిష్కరణ తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం: రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగాపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగాపురం కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.శ్యామల సోమవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 7,8,9 తరగతుల మిగులు సీట్ల భర్తీ నిమిత్తం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యా సంవత్సరానికి గాను కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు (ఇంగ్లిష్ మీడియం), ఇంటర్మీడియెట్ బైపీసీలో 40 సీట్లు (ఇంగ్లిష్ మీడియం) ఉన్నాయన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, మధ్యలో బడిమానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల బాలబాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 11వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

ఇంగ్లిష్ నైపుణ్య పోటీలో ప్రతిభ

రెడ్డిగూడెం: లీప్ ఫర్ వర్డ్, వర్డ్ పవర్ చాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ నైపుణ్య పోటీలకు ఎంపీపీఎస్ బూరుగగూడెం (డి.డబ్ల్యూ) పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.శిరీష సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎం.అనుదీప్, టి.చరణ్య, ఎం.మేద్విత, కే గౌతమ్, జే సాత్విక్‌లను పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు బి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో ఏఎంసీ అభివృద్ధికి కృషి

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సహకారంతో వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కంబాల కృష్ణవేణి, బర్మా సీతారామయ్య చెప్పారు. సోమవారం కాట్రేనిపాడులో వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరులుగా ఉన్న తమకు నూజివీడు ప్రాంత రైతులకు సేవ చేసే అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కంబాల రాంబాబు, సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ముసునూరు: బలివేలో మహాశివరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను చేయించారు. 100 మంది పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈఓపీఆర్డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు గ్రామ వీధులన్నింటా క్లోరినేషన్ చేయించి, హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

ఏ.కొండూరు: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 22 మంది మహిళలను ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించాలంటే విద్య మంచి సాధనమన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ స్వాతి, ఎంపీడీఓ పరమాత్మ, ఎస్ఓ మీరున్నీసా, బి.భారతి, జి.రత్నకుమారి, సుధారాణి, సెక్టార్ సూపర్‌వైజర్లు శివకుమారి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ముసునూరు: విద్యతోనే సమాజంలో మనిషికి నిజమైన ఉనికి, గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ బీవీ సుబ్బారావు అన్నారు. మండలంలోని గుడిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం నిర్మలాదేవి అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ స్థాయి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులను, 10వ తరగతి విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు సాయిబాబా, జయరామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమం

- ఎంపీ కేశినేని, సర్నాల, నల్లగట్ల
- వైఎస్సార్ చేయూత నమూనా చెక్కుల అందజేత



రెడ్డిగూడెంలో చేయూత చెక్కును అందజేస్తున్న కేశినేని శ్రీనివాస్(నాని)



కె.తాడేపల్లిలో వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న తిరుపతిరావు, ఎంపీపీ, జెడ్పీటీసీ



ఆగిరిపల్లిలో చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



విస్సన్నపేటలో నమూనా చెక్కు అందజేస్తున్న స్వామిదాసు

రెడ్డిగూడెం: పేదల బతుకుల్లో వెలుగులు నింపాలంటే మరలా జగన్ మోహన్‌రెడ్డిని సీఎం కావాలని విజయవాడఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నాలుగొ విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన మహిళలకు సంవత్సరానికి రూ.18,750 చొప్పున ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.75 వేల వరకు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు.

పలు ప్రారంభోత్సవాల్లో..

మండలంలోని రుద్రవరం గ్రామంలో వెల్‌నెస్ సెంటర్, రెడ్డిగూడెం ఎస్సీకాలనీలోని వెల్‌నెస్ సెంటర్‌ను, అనేవవుపేట గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌ను, మద్దులపర్వ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను, కూనపరాజుపర్వ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు యాదవ్‌తో కలసి ఎంపీ ప్రారంభించారు. మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, మైలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మహిళలను లక్షాధికారులను చేయడం లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత, పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 4,443 మంది లబ్ధిదారులకు నాలుగో విడత ద్వారా రూ.8.31 కోట్ల మెగా చెక్కును అందజేశారు. 1,284 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ గోళ్ల అనూష, వైస్ ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎమ్మార్వో మృత్యుంజయరావు, ఎంపీడీవో శామ్యూల్ పాల్గొన్నారు.

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): జగనన్న ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు అన్నారు. సోమవారం కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండలంలోని 6 వేల 872 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.12 కోట్ల 89 లక్షలు వైఎస్సార్ చేయూత నాలుగో విడత నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం సర్పంచి ఉయ్యూరు గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, కల్పన పాల్గొన్నారు.

జి.కొండూరు: మహిళలను అర్థికంగా అభివృద్ధి చేసేందుకే వైఎస్సార్ చేయూత వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో అధికారులు సోమవారం నిర్వహించారు. తిరుపతిరావు లబ్ధిదారులకు చేయూత నమూనా చెక్కును అందజేశారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం లబ్ధిదారులకు చేయూత చెక్కును మైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అందజేశారు. మైలవరం, జి.కొండూరు మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో నాలుగో విడత రూ.8. 43 కోట్లు చేయూత నమూనా చెక్కుమైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు సోమవారం మహిళలకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అధ్యక్షతన పలువురు పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక మార్కెట్‌యార్డు గోదాము వద్ద వైఎస్సార్ చేయూత నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సోమవారం నిర్వహించారు. మండలంలో 3,837 మందికి రూ.7.19,43,750 నగదు డైరెక్ట్‌గా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు రెడ్డి వెంకట శ్రీనివాసరావు, గాజుల శ్రీనివాసరావు, దస్తగిరి, సీత, ఈవోపీఆర్డీ ఝాన్సీరాణీ, ఏపీఎం జమలయ్యలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల్లో సమగ్ర మార్పు



తిరువూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలతో పేదల జీవన విధానంలో సమగ్ర మార్పు వచ్చిందని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. సోమవారం తిరువూరు రాజుపేట ఒకటో వార్డులో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. వార్డులోని పలువురు లబ్ధిదారుల్ని కలిసి వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలను గురించి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికీ రాజకీయాలకు అతీతంగా మంజూరు చేసిన పథకాలతో గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాల్లో జరిగిన అభివృద్ధిని గమనించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని బలపరచాలని స్వామిదాసు కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి, వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, కొలికపోగు నిర్మల, మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, పరసా నెహ్రూజీ, గత్తం నాగేశ్వరరావు, దేవిశెట్టి బాలకృష్ణ, చలమాల సత్యనారాయణ, కాలసాని గోపాల నాగేశ్వరరావు, దుర్గారావు, రాజీమహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లను ఆదుకున్న ఏకైక సీఎం జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలోని పాస్టర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం అందించి వారిని ఆదుకున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని, పాస్టర్లందరూ ఎల్లవేళలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలో నూజివీడు డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ బాడీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి పాస్టర్లందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పోటీ చేస్తున్నారని, తమను పాస్టర్లందరూ అండగా ఉండి గెలిపించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఏసుక్రీస్తు అంటే తనకు ఎంతో నమ్మకమని, ప్రతిఏటా గుణదల తిరునాళ్లు, సిలువగట్టు తిరునాళ్లలో ఏసుక్రీస్తును దర్శించుకుంటానన్నారు. పాస్టర్లకు ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఐదు సెంట్ల స్థలాన్ని అడిగిన వెంటనే కేటాయించామని, రాబోయే రోజుల్లో ఇక్కడ క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. నూజివీడు డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ కేటీ ప్రభాకర్‌రావు, అంతర్జాతీయ ప్రసంగీకులు పి.జీవన్‌కుమార్, బండి ఐజాక్, ముసునూరు జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్, పలువురు కౌన్సిలర్లు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే

అనంతరం నూజివీడు డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కేటీ ప్రభాకర్‌రావు, అధ్యక్షులుగా పి.ఇమ్మానుయేలు, ఉపాధ్యక్షులుగా తలారి సూర్యప్రకాష్, జీ మహేష్, ప్రధాన కార్యదర్శిగా టీ లాజరస్, కోశాధికారిగా తలారి జీవరత్నం, సంయుక్త కార్యదర్శులుగా పీ వెంకటేశ్వరరావు, వై.సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా నాయక్, దేవ సహాయం, యేసేపు, జాన్‌పాల్ ఎన్నికయ్యారు.

30 మంది విద్యార్థులు గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర గణితం, జంతుశాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల పరీక్షకు 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవగా, 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఈ పరీక్షకు పట్టణంలోని ఐదు కేంద్రాల్లో కలిపి 1,231 మంది విద్యార్థులకు 1,201 మంది పరీక్షలకు హాజరు కాగా, 30 మంది గైర్హాజరయ్యారు. మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 323 మందికి ఏడుగురు గైర్హాజరవగా, 316 మంది పరీక్షకు హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో 212 మందికి ముగ్గురు గైర్హాజరవగా, 209 మంది, శ్రీ శారద జూనియర్ కళాశాలలో 255 మందికి ఆరుగురు గైర్హాజరవగా 249 మంది, శ్రీవాగ్దేవి జూనియర్ కళాశాలలో 249 మందికి ఏడుగురు గైర్హాజరవగా 242 మంది, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 192 మందికి ఏడుగురు గైర్హాజరవ్వగా 185 మంది పరీక్షకు హాజరయ్యారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన

- ఎంపీ కేశినేని శ్రీనివాస్
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం



తోలుకోడులో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు తదితరులు

తోలుకోడు(మైలవరం): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం పరిపాలన సాగుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ అని, గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేస్తున్న వ్యక్తి సీఎం జగన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకు వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లూరు(మైలవరం): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన వైద్యం అందించమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ప్రతి గ్రామంలోనూ వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారని విజయవాడ ఎంపీ కేశినేనిశ్రీనివాస్(నాని)తెలిపారు. పుల్లూరు గ్రామంలో నిర్మించిన వెల్నెస్ సెంటర్, గ్రామ సచివాలయం భవనాలను సోమవారం ఎంపీ కేశినేని శ్రీనివాస్ మైలవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావుతో కలిసి ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వెల్నెస్ సెంటర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేము సిద్ధం-మా బూత్ సిద్ధం

లోపూడి (ముసునూరు): ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గెలిపించుకుని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి, మేము సిద్ధం–మా పోలింగ్ బూత్ సిద్ధం, మా గ్రామం సిద్ధం అంటూ లోపూడి ప్రజలు నినదించారు. మండలంలోని లోపూడి రైస్‌మిల్లు సెంటర్, గౌడ బజారు, దళితవాడల్లో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బి.నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మేము సిద్ధం–మా పోలింగ్ బూత్ సిద్ధం అంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరం కృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ వరికూటి ప్రతాప్, నేతలు కోటగిరి కొండలరావు, ధర్మారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

ముసునూరు: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని నోడల్ అధికారి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ కోరారు. సోమవారం మాట్లాడుతూ కొర్లగుంట సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు కరిముల్లా, అవినాష్, భవాని, మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

పోలీసుల కవాతు

తిరువూరురూరల్:మండలంలో పోలీసులు, భద్రతా దళాలు సోమవారం కవాతు నిర్వహించాయి. రానున్న ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నియమితులైన రిజర్వు పోలీసు బలగాలతో ము నుకుళ్ల, అక్కపాలెం, వావిలాల గ్రా మాల్లో ఈ కవాతు జరిగింది. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జి.కొండూరు: మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు గ్రామం నుంచి జి.కొండూరు వైపు తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి వీఆర్ఓ సురేష్ స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్ డీటీ మాధవీలత రేషన్ బియాన్ని సోమవారం పరిశీలించారు. జి.కొండూరుకు చెందిన బత్తుల నరేష్‌పై కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానీశంకరి సూచించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని పలు గ్రామాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు ఈ కార్యక్రమంపై ఎంతో నమ్మకంతో అర్జీలను అందజేస్తున్నారని, అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో అధికారులు పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించడానికి వీలులేకపోతే దానికి సంబంధించిన కారణాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అర్జీదారులు తమ అర్జీ పరిష్కార స్థితిని ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. మొత్తం 8 అర్జీలు రాగా, వాటిలో భూముల సర్వే చేయాలని, ఆక్రమణలను తొలగించాలని, పింఛన్ మంజూరు చేయాలంటూ అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వెంకటరత్నం, ఏసీడీపీవో నాగేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, ట్రిపుల్ ఐటీ ఎస్సై జగ్జీవన్ రామ్, పలువురు డివిజన్ స్థాయి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తృణ ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

జి.కొండూరు: గర్భిణులు, బాలింతలు నిత్యం ఆహారంతో పాటు తృణ ధాన్యాలను తీసుకోవడం వల్లన సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా తృణధాన్యాల వల్లన కలిగే ప్రయోజనాలపై స్థానిక కమ్యూనిటీ హాలులోమహిళలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తృణ ధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, పెసలు, అరికలు, సామ లు, ఊదలు, కొడిశమ, జొన్నలు వంటి వాటిని తీసుకోవడం వల్లన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. సీడీపీఓ పుష్పలత, ఏసీడీపీఓ లలితకుమారి, సెక్టార్ సూపర్‌వైజర్ అన్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు చేపట్టిన పోషణ్ పక్వాడా కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉమాదేవి కోరారు. ఎంపీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన పోషణ్ పక్వాడా పక్షోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు.సీడీపీవో, సీహెచ్‌వో నారాయణ, సూపర్ వైజర్లు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

నూజివీడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరూ లబ్ధిపొందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న గ్రాంట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేయాలన్నారు. వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దీనికి చేతి పంపులన్నీ పనిచేసేలా చూడాలని, పాడైన మోటార్లకు మరమ్మతులు చేయించాలన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద మండలంలో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వశాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, డీవైఈవో ఎం.సేవియా, ఏపీవో సోమేశ్వరి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.